

## మాజీ దంపతుల అమీతుమీ!

విష్ణుపూర్: బెంగాల్‌లోని విష్ణుపూర్ లోక్‌సభ సీటు కోసం ఈసారి సిట్టింగ్ ఎంపీ సౌమిత్రా ఖాన్ (బీజేపీ), ఆయన మాజీ భార్య సుజాతా మోండల్ (టీఎంసీ) పరస్పరం పోటీపడుతున్నారు. గతంలో హైకోర్టు విధించిన నిషేధం వల్ల సౌమిత్రా ఖాన్ బంకురా జిల్లాలో ప్రవేశించేందుకు వీల్లేకపోవడంతో 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన తరఫున భార్య సుజాతా మోండల్ ప్రచారం నిర్వహించారు. దీంతో ఆయన విష్ణుపూర్ నియోజకవర్గం నుంచి 78 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో రెండోసారి ఎంపీగా గెలిచారు. అప్పటికి భర్తతో కలిసి బీజేపీలోనే ఉన్న సుజాతా మోండల్ కాల క్రమంలో టీఎంసీలో చేరాలని నిర్ణయించుకోవడంతో 2020లో ఆ దంపతులు విడాకులు తీసుకున్నారు. గత ఐదేండ్లలో వారి వ్యక్తిగత, రాజకీయ సమీకరణలు మారిపోవడంతో ఇప్పుడు ఒకరిపై మరొకరు కత్తులు దూసుకుంటున్నారు.



# 250 సీట్లయినా దాటేనా?

## కమలానికి సీట్లపై గణాంకాల గడబిడ

- 370 సీట్లన్న బీజేపీ ప్రచారం మైండ్‌గేమన్న విశ్లేషకులు
- పదేండ్ల ఎన్డీయే పాలనపై ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత
- విపక్షాల ఐక్యతతో ఉమ్మడి అభ్యర్థికే గెలుపు అవకాశం
- పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న ప్రాంతీయ పార్టీల బలం
- కమలానికి 250 సీట్లు వస్తే గొప్పేనంటున్న పరిశీలకులు



హైదరాబాద్, ఏప్రిల్ 26, (నమస్తే తెలంగాణ): రెండు నెలల కిందట ఫిబ్రవరి 5న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీకి 370 సీట్లు, ఎన్డీయే కూటమికి 400 సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. గత 77 ఏండ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒకే ఒక్కసారి 414 సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. అదీ 1984లో ఇందిరాగాంధీ హత్య తరువాత దేశవ్యాప్తంగా వచ్చిన సానుభూతి ఓట్లతో మాత్రమే. బీజేపీ 2014లో 428 స్థానాల్లో పోటీ చేసి 282 సీట్లు గెలుచుకున్నది. ఇక 2019లో 436 సీట్లలో పోటీ చేసి 303 సీట్లు సాధించింది. ఆ క్రమంలోనే 370 సీట్లు గెలవడం సాధ్యమని మోదీ భావించి ఉండవచ్చు. కానీ ప్రస్తుతం ఎన్నికల వేడి పుంజుకున్న నేపథ్యంలో బీజేపీ గెలుచుకోబోయే సీట్లపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

**కొత్తగా కలిసొచ్చే అంశాలు సున్నా**

గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుచుకున్న 303 ఎంపీలలో రాజీనామాలు, ఎంపీల మరణాలు, ఉప ఎన్నికలు వంటి కారణాలతో 14 స్థానాలను బీజేపీ కోల్పోయింది. దాంతో ప్రస్తుతం అధికార పార్టీకి లోక్‌సభలో 289 సభ్యులున్నారు. పార్టీ విజయంపై మోదీ ఆత్మవిశ్వాసం నిజం కావాలంటే ప్రస్తుతమున్న ప్రతి స్థానాన్ని నిలుపుకోవడం, గత ఐదేండ్లలో కోల్పోయిన 14 సీట్లను తిరిగి గెలుచుకోవడంతోపాటు అదనంగా మరో 67 సీట్లు తెచ్చుకోవాలి. ప్రస్తుత ఎన్నికల్లో ఆ సీట్లన్నింటినీ మళ్లీ బీజేపీ పొందగలదా అంటే ప్రశ్నార్థకమే. ఈ సారి కొత్తగా బీజేపీకి కలిసి వచ్చే అంశాలు గానీ, ప్రాంతాలు గానీ ఏమీలేవు. ఈ ఐదేండ్లలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేరువ కాకపోగా అధికంగా వ్యతిరేకతను మూటగట్టుకున్నది.

**రెండో విడతలో అన్నీ ప్రజావ్యతిరేక నిర్ణయాలే**

రెండో విడత అధికారం చేపట్టిన బీజేపీ ఆ తర్వాత తీసుకున్నవన్నీ ప్రజావ్యతిరేక నిర్ణయాలే. పెట్రోల్, గ్యాస్ ధరల రెట్టింపు, నిత్యావసర ధరల పెంపు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం, నూతన వ్యవసాయ చట్టాలు, పెరిగిన రైతుల ఆత్మహత్యలు, తీవ్ర ద్రవ్యోల్బణం వంటి అంశాలు దేశ ప్రజలను అల్లకల్లోలం చేసి, తీవ్ర వేదనలోకి నెట్టివేశాయి. ఆ కారణంగా బీజేపీ ప్రాబల్యమున్న రాష్ట్రాల్లోనే ఆ పార్టీకి 2019 ఎన్నికలనాటి విజయం అసాధ్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో మళ్లీ 2019 ఎన్నికల్లో మాదిరి 249 సీట్లు గెలిచిందనుకున్నా కూడా 370 స్థానాలను పొందాలంటే మిగతా భారతావనిలోని 213 స్థానాల నుంచి 121 సీట్లు గెలవాలి. ఆ 213 స్థానాల్లో గతంలో 54 సీట్లు మాత్రమే గెలుచుకున్న బీజేపీకి ఇది ఎంతవరకు సాధ్యమో చూద్దాం

**ప్రాంతీయ పార్టీలదే హవా**

బీజేపీకి బలం లేని రాష్ట్రాల్లో విజయం సాధించే సీట్లు పెద్దగా పెరిగే అవకాశాలు లేవు. ఈ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకు ప్రజల్లో మంచి బలం ఉన్నది. అలాగే స్థానిక సమస్యలపై బీజేపీకి సరైన అవగాహన లేని కారణంగా జాతీయ స్థాయిలో తీసుకునే నిర్ణయాలపై ఆయా రాష్ట్రాల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. ఉదాహరణకు జాతీయ స్థాయిలో నీట్ పరీక్ష నిర్వహణను అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. పదేండ్ల బీజేపీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగిపోవడం, పెట్రో, గ్యాస్ ధరలు రెట్టింపవడం, ధనవంతులే మరింత అభివృద్ధి చెందడం వంటివి ప్రజల్లో వ్యతిరేకతను పెంచాయి. నిరుద్యోగం పెరిగిపోయి యువతలో వ్యతిరేకత పెల్లుబుకింది. రైతు వ్యతిరేక చట్టాలు, గిట్టుబాటు ధరకు హామీ లేకపోవడం వంటి సమస్యలతో రైతుల్లో ఆత్మహత్యలు పెరిగాయి. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన మీదట బీజేపీకి గట్టి పట్టున్న రాష్ట్రాల్లోని 330 స్థానాలకు గాను 220 సీట్లు గెలుచుకుంటే గొప్పేనని, అలాగే బీజేపీకి అంతగా బలం లేని రాష్ట్రాల్లోని 213 స్థానాలకు గాను ఈ సారి 30 సీట్లు గెలుచుకోవచ్చునని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బీజేపీ పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, ప్రాంతీయ పార్టీలపై ప్రజలకు పెరుగుతున్న నమ్మకం కారణంగా బీజేపీకి ఈ సారి ఎన్నికల్లో మొత్తం మీద 250 సీట్లకు మించి గెలుచుకునే అవకాశం లేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఆ కారణంగానే సందిగ్ధతతో కొట్టుమిట్టాడుతున్న బీజేపీ మైండ్‌గేమ్‌కు తెరతీసిందని, అందులో భాగంగానే 370 స్థానాల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ప్రచారం మొదలు పెట్టిందని పరిశీలకులు భావిస్తున్నారు. చిన్నా చితకా పార్టీలతో పొత్తులు కుదుర్చుకోవడానికి కూడా ఇదే కారణమని వారు స్పష్టం చేస్తున్నారు.

### బీజేపీ, దాని మిత్రపక్షాలకు గట్టి పట్టున్న రాష్ట్రాలు, గెలిచిన సీట్లు, ఓట్ల శాతం

| రాష్ట్రం | మొత్తం స్థానాలు | బీజేపీ గెలిచిన స్థానాలు | వచ్చిన ఓట్ల శాతం |
|---|---|---|---|
| యూపీ | 80 | 62 | 50.0 |
| మధ్యప్రదేశ్ | 29 | 28 | 58.5 |
| గుజరాత్ | 26 | 26 | 63.1 |
| కర్ణాటక | 28 | 25 | 51.8 |
| రాజస్థాన్ | 25 | 24 | 59.1 |
| మహారాష్ట్ర | 48 | 23 | 27.8 |
| బీహార్ | 40 | 17 | 24.1 |
| జార్ఖండ్ | 14 | 11 | 51.6 |
| హర్యానా | 10 | 10 | 58.2 |
| అస్సాం | 14 | 9 | 36.4 |
| ఛత్తీస్‌గఢ్ | 11 | 9 | 51.4 |
| ఉత్తరాఖండ్ | 5 | 5 | 61.7 |
| మొత్తం | 330 | 249 | |

### బీజేపీయేతర, పలు ఇతర రాష్ట్రాలు

| రాష్ట్రం | మొత్తం స్థానాలు | బీజేపీ గెలిచిన స్థానాలు | వచ్చిన ఓట్ల శాతం |
|---|---|---|---|
| వెస్ట్ బెంగాల్ | 42 | 18 | 40.6 |
| ఒడిశా | 21 | 8 | 38.9 |
| ఢిల్లీ | 7 | 7 | 56.9 |
| హిమాచల్ | 4 | 4 | 69.7 |
| తెలంగాణ | 17 | 4 | 19.7 |
| పంజాబ్ | 13 | 2 | 9.7 |
| గోవా | 2 | 1 | 51.9 |
| ఆంధ్రప్రదేశ్ | 25 | 0 | 1.0 |
| కేరళ | 20 | 0 | 13.0 |
| సిక్కిం | 1 | 0 | 4.7 |
| తమిళనాడు | 39 | 0 | 3.6 |
| ఈశాన్య రాష్ట్రాలు | 10 | 5 | |
| యూటీలు | 12 | 5 | |
| మొత్తం | 213 | 54 | |



బెంగళూరులో ఆక్సిజన్ సిలిండర్ పెట్టుకొని ఓటేసేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు

## రెండో దశలో 63.5% ఓటింగ్

- అత్యధికంగా త్రిపురలో 79.46 శాతం
- 13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు పోలింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: లోక్‌సభ రెండో దశ ఎన్నికల పోలింగ్ శుక్రవారం ముగిసింది. 13 రాష్ట్రాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో దాదాపుగా 63.5శాతం ఓటింగ్ నమోదైంది. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. త్రిపురలో అత్యధికంగా 79.46 శాతం పోలింగ్ జరిగింది. ఆ తర్వాత మణిపూర్‌లో 77.32 శాతం ఓటింగ్ నమోదైంది. ఉత్తరప్రదేశ్‌లో 54.85 శాతం, బిహార్‌లో 55.08 శాతం పోలింగ్ జరిగింది. కేరళలోని మొత్తం 20 స్థానాలు, కర్ణాటకలో 14, రాజస్థాన్‌లో 13, మహారాష్ట్రలో 8, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, అస్సాంలో 5, బీహార్‌లో 5, ఛత్తీస్‌గఢ్‌లో 3, పశ్చిమ బెంగాల్‌లో 3, మణిపూర్‌లో 1, త్రిపురలో 1, జమ్ము కశ్మీర్‌లో 1 స్థానానికి రెండో దశలో పోలింగ్ జరిగింది.

**పలుచోట్ల చెదురుమదురు సంఘటనలు**

ఎన్నికలు జరిగిన పలు ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడం వల్ల ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. కేరళలో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్న ఒక పోలింగ్ ఏజెంట్, ఓటేసిన ముగ్గురు ఓటర్లు ఎండ వేడి, అనారోగ్య వల్ల మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్‌లో ఎన్నికల భద్రతా విధుల్లో ఉన్న ఓ జవాన్ గన్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణిపూర్‌లోని కల్లోలిత ప్రాంతాల్లో భారీ భద్రత మధ్య ఓటింగ్ జరిగింది. పలుచోట్ల మిలిటెంట్లు ఓటర్లను ఓటేయొద్దని బెదిరించారు. కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలోని ఇండిగనత గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణతో పలు ఈవీఎంలు ధ్వంసమయ్యాయి. కాగా, బెంగళూరులోని ఓ ప్రైవేటు దవాఖానలో ఉన్న 41 మంది పేషెంట్లు ఓటు వేసేందుకు గ్రీన్ కారిడార్లు ఏర్పాటుచేసి అంబులెన్సుల్లో తీసుకెళ్లారు.

**బీజేపీ నేతలపై కేసు నమోదు**

మతం పేరుతో ఓట్లడుగుతూ సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసిన బెంగళూరు దక్షిణ బీజేపీ అభ్యర్థి తేజస్వీ సూర్యపై కేసు నమోదైంది. విద్వేష వ్యాఖ్యలు చేసి, ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతున్నారనే ఆరోపణలపై కర్ణాటకకు చెందిన సీనియర్ బీజేపీ నేత సీటీ రవిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

**ఐదో దశ నోటిఫికేషన్ విడుదల**

లోక్‌సభ ఎన్నికల ఐదో దశ నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం శుక్రవారం జారీ చేసింది. బీహార్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జమ్ముకశ్మీర్, లడక్‌లో ఈ దశలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 49 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. అతి తక్కువ స్థానాల్లో ఓటింగ్ జరగనున్న దశ ఇదే. ఈ విడతలో మే 20న పోలింగ్ జరగనుంది.

## బీజేపీకి ఓటేయకుంటే.. బుల్డోజర్లు వస్తయ్!
### అస్సాంలోని ఓ గ్రామంలో ముస్లింలకు బెదిరింపులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలని, లేకపోతే మీ ఇండ్లమీదకు బుల్డోజర్లను పంపిస్తామని అస్సాంలోని హైలకండీ జిల్లాలోని బుటుకుసీ గ్రామంలోని ముస్లింలను అక్కడి అధికారులు బెదిరించారు. దీంతో బాధితులు స్థానిక కోర్టును ఆశ్రయించారు. అటవీశాఖకు చెందిన తొమ్మిది మంది అధికారులు తమను హెచ్చరించినట్టు బాధితులు వాపోయారు. అటవీశాఖ ప్రధాన కార్యదర్శి, బీజేపీ సానుభూతిపరుడు ఎంకే యాదవ్ కూడా తమను బెదిరించిన వారిలో ఉన్నట్టు ఆరోపించారు. బాధితుల పిటిషన్‌ను విచారించిన కోర్టు దర్యాప్తు జరుపాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

## అమెరికాలో భారత సంతతి విద్యార్థిని అరెస్ట్

న్యూయార్క్: పాలస్తీనాకు మద్దతుగా ధర్నా నిర్వహించినందుకు భారత సంతతి విద్యార్థిని అచింత్యా శివలింగన్‌ను అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం అరెస్ట్ చేసి క్యాంపస్ నుంచి బహిష్కరించింది. అచింత్యాపై క్రమశిక్షణ చర్యలు సైతం తీసుకోనున్నట్టు వర్సిటీ అధికారి ప్రతినిధి గురువారం వెల్లడించారు. సుమారు వంద మంది విద్యార్థులు వర్సిటీలో గుడారాలు వేసుకొని ఆందోళన చేశారు.

## గూగుల్ యాడ్స్‌కే 101 కోట్లు!

- 2018 నుంచి బీజేపీ వ్యయం ఇది..
- రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేసిన దేశంలోనే మొదటి పార్టీ బీజేపీనే
- 45 కోట్లతో రెండో స్థానంలో కాంగ్రెస్

న్యూఢిల్లీ: గూగుల్‌లో రాజకీయ ప్రకటనలు ఇచ్చే విషయంలో కేంద్రంలోని అధికార బీజేపీ ముందున్నది. గూగుల్, ఆ సంస్థ వీడియో ప్లాట్‌ఫాం యూట్యూబ్‌పై ప్రకటనలకు 100 కోట్లపైగా ఖర్చు చేసిన దేశంలోనే తొలి పార్టీగా బీజేపీ నిలిచింది. 2018, మే 31–2024, ఏప్రిల్ 25 మధ్య కాలంలో డిజిటల్ క్యాంపెయిన్ (రాజకీయ ప్రకటనలు) కోసం అధికార బీజేపీ దాదాపు రూ.101 కోట్లు ఖర్చు చేసిందని, ఇది అన్ని పార్టీల మొత్తంలో (రూ.390 కోట్లు) 26 శాతమని గూగుల్ యాడ్స్ ట్రాన్స్‌పరెన్సీ సెంటర్ డాటాను ఉటంకిస్తూ ఇండియా టుడే వెల్లడించింది. గూగుల్ యాడ్స్‌పై వ్యయంలో రూ.45 కోట్లతో ప్రతిపక్ష కాంగ్రెస్ రెండో స్థానంలో ఉండగా.. తర్వాతి స్థానంలో డీఎంకే (రూ.42 కోట్లు) ఉన్నది.

**రెండో దశలో బీజేపీని మించిన కాంగ్రెస్!**

లోక్‌సభ ఎన్నికల రెండో దశ ప్రచారంలో భాగంగా గూగుల్ యాడ్స్‌పై ఖర్చులో కాంగ్రెస్ పార్టీ బీజేపీని మించిపోయింది. ఈనెల 18 నుంచి 24 మధ్య రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలు, పాలసీలు, తదితర అంశాలను గూగుల్‌పై ప్రచారం చేసుకొనేందుకు గూగుల్ యాడ్స్‌పై రూ.14 కోట్లు ఖర్చు చేశాయి. ఇందులో కాంగ్రెస్ రూ.5.7 కోట్లు, తర్వాతి స్థానంలో బీజేపీ రూ.5.3 కోట్లు వ్యయం చేశాయి. కర్ణాటకలో బీజేపీ అధికంగా ఖర్చు చేయగా.. కాంగ్రెస్ ప్రధానంగా కేరళపై దృష్టి పెట్టింది.

**గత ఆరేండ్లలో గూగుల్ యాడ్స్‌పై పార్టీల ఖర్చు**

| పార్టీ | వ్యయం (రూ.ల్లో) |
|---|---|
| బీజేపీ | 101 కోట్లు |
| కాంగ్రెస్ | 45 కోట్లు |
| డీఎంకే | 42 కోట్లు |





**బీజేపీ ఏ రాష్ట్రంలో ఎంత ఖర్చు?**

| | |
|---|---|
| కర్ణాటక | 10.8 కోట్లు |
| ఉత్తరప్రదేశ్ | 10.3 కోట్లు |
| రాజస్థాన్ | 8.5 కోట్లు |
| ఢిల్లీ | 7.6 కోట్లు |

**రెండో దశలో పార్టీల ఖర్చు**

| పార్టీ | వ్యయం(రూ.ల్లో) |
|---|---|
| కాంగ్రెస్ | 5.7 కోట్లు |
| బీజేపీ | 5.3 కోట్లు |
| వైసీపీ | 1.76 కోట్లు |



## 100% వీవీప్యాట్ల లెక్కింపు కుదరదు

- ఎన్నికల వేళ సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఈవీఎంలపై పిటిషన్లు కొట్టివేత
- సింబల్ లోడింగ్ యూనిట్లను కనీసం 45 రోజులు భద్రపర్చాలి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ 'ఈవీఎం–వీవీప్యాట్ల లెక్కింపు'నకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లలో పోలైన అన్ని ఓట్లను మొత్తం వీవీప్యాట్ల స్లిప్పులతో (100% స్లిప్పులతో) సరిపోల్చాలంటూ దాఖలైన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసింది. బ్యాలెట్ పద్ధతిలోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పును వెలువరించింది.

**విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**

- ఈవీఎంలతో వీవీప్యాట్ స్లిప్పులన్నింటినీ పోల్చి చూడాల్సిన పని లేదు. స్లిప్పులను తీసుకుని ఓటరు మరో బాక్స్‌లో వేయాల్సిన అవసరం కూడా లేదు.
- ప్రొటోకాల్స్, సాంకేతికంగా ఈవీఎంల పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి.. అధికారులను అడిగి అన్ని వివరాలను తెలుసుకున్నాకే ఇది చెప్తున్నాం.
- ఈవీఎంలతో వీవీప్యాట్ స్లిప్పులను వందశాతం సరిపోల్చాలని వచ్చిన పిటిషన్లు సరికాదు.





**ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కీలక ఆదేశాలు**

- ఈవీఎంలలో ఎన్నికల గుర్తులను లోడ్ చేశాక ఆ యూనిట్‌ను సీల్ చేయాలి. అనంతరం వీటిని కంటైనర్లలో భద్రంగా పెట్టాలి.
- ఫలితాలు వెలువడిన కనీసం 45 రోజుల వరకు ఈవీఎంలతో పాటు, వీవీప్యాట్లను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చాలి.
- ఎన్నికల్లో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తే, వాటిని తనిఖీ చేసుకోవచ్చు.
- ఈవీఎంలలోని మైక్రోకంట్రోలర్‌లో బర్న్ చేసిన మెమొరీని ఈవీఎం తయారీదారులైన ఇంజినీర్ల సాయంతో అభ్యర్థులు ఈ తనిఖీలు నిర్వహించుకోవచ్చు.
- కంట్రోల్ యూనిట్‌లోని 5 శాతం ఈవీఎంలను, వీవీప్యాట్లను సరిపోల్చుకొని ఈ విధంగా తనిఖీ చేయించుకోవచ్చు.
- ఇందుకుగానూ ఫలితాలు వెలువడిన ఏడు రోజుల్లోగా ఫీజు చెల్లించి ఫిర్యాదుదారులు రాతపూర్వకంగా వినతి ఇవ్వాల్సి ఉంటుంది.
- ఫిర్యాదుదారే దీనికి అయ్యే ఖర్చును భరించాలి.
- ఒకవేళ ఈవీఎంలు ట్యాంపర్ అయినట్టు ఈ తనిఖీల్లో తేలితే.. అభ్యర్థులు చెల్లించిన ఫీజును తిరిగి ఇచ్చేయాలి.

**కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి: మోదీ**

సుప్రీంకోర్టు తీర్పుపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షానికి ఇది చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. ఈవీఎంలపై అపనమ్మకాన్ని సృష్టించినందుకు క్షమాపణ లు చెప్పాలని డిమాండ్ చేశారు.

### దేశవ్యాప్తంగా యూసీసీ అమలు చేస్తాం
#### ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

గుణా, బెమెతరా: కాంగ్రెస్ పార్టీ మతాలవారీగా వ్యక్తిగత చట్టాల అమలుకు హామీ ఇస్తే.. బీజేపీ మాత్రం మోదీ గ్యారంటీగా ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)ని దేశవ్యాప్తంగా అమలు చేస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని బెమెతరా, మధ్యప్రదేశ్‌లోని గుణాలో జరిగిన లోక్‌సభ ఎన్నికల సభల్లో ఆయన ప్రసంగించారు. 'కాంగ్రెస్ మ్యానిఫెస్టో జాగ్రత్తగా చదవండి. వాళ్లు షరియా చట్టాన్ని, ట్రిపుల్ తలాక్‌ను మళ్లీ తీసుకురావాలనుకుంటున్నారు. ఈ దేశాన్ని షరియా చట్టంతో నడపాలా?' అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ఉన్నంత వరకు వ్యక్తిగత చట్టాలను అమలు చేయనివ్వదన్నారు. ఇప్పటికే తాము ఉత్తరాఖండ్‌లో యూసీసీని అమలు చేశామని తెలిపారు.

### నోటాకు మెజారిటీ వస్తే మళ్లీ ఎన్నిక!?
#### ఈసీ వివరణ కోరిన సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో నోటాకు మెజారిటీ ఓట్లు వస్తే మళ్లీ కొత్తగా ఎన్నిక నిర్వహించాలన్న అంశంపై సుప్రీం కోర్టు ఈసీని వివరణ కోరింది. అభ్యర్థుల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే, మళ్లీ ఎన్నిక నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టులో సామాజిక కార్యకర్త శివ ఖేరా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఈసీకి నోటీసులు జారీ చేసింది.

### జై శ్రీరామ్, క్రికెటర్ల పేర్లు రాసిన విద్యార్థుల పాస్!

లక్నో, ఏప్రిల్ 26: ఉత్తరప్రదేశ్‌లోని వీర్ బహదూర్ సింగ్ పూర్వాంచల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ల నిర్వాకం తాజాగా వెలుగులోకి వచ్చింది. డీ ఫార్మసీ పరీక్షల్లో 'జై శ్రీరామ్' అనే నినాదాలు, క్రికెటర్ల పేర్లు రాసిన పలువురు విద్యార్థులను పాస్ చేశారు. ఇద్దరు విద్యార్థుల ఆర్టీఐ దరఖాస్తు ద్వారా ఈ బాగోతం బయటకు వచ్చింది. తమను పాస్ చేసేందుకు విద్యార్థులు ప్రొఫెసర్లకు లంచం ఇచ్చారని ఆరోపణలు రాగా, ఇద్దరు ప్రొఫెసర్లను వీసీ డిస్మిస్ చేశారు.

## 2025 నుంచి ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు!
### విధానాలు రూపొందించాలని సీబీఎస్‌ఈకి కేంద్రం సూచన



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: 2025–26 అకడమిక్ సంవత్సరం నుంచి ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించడంపై విధివిధానాలు రూపొందించాలని సీబీఎస్‌ఈని కేంద్ర విద్యా శాఖ కోరిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే ఆలోచన లేదని తెలిపాయి. ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించే అంశంపై విద్యా శాఖ, సీబీఎస్‌ఈ వచ్చే నెలలో పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సంప్రదింపులు చేయనున్నట్టు పేర్కొన్నాయి. విద్యార్థులకు సరిపడా సమయం ఉండటంతోపాటుగా పరీక్షల్లో ఉత్తమ ప్రదర్శన కనపర్చేందుకు ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ గత ఏడాది విడుదల చేసిన కొత్త నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌సీఎఫ్) సూచించింది. కాగా, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గతంలో మాట్లాడుతూ బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరుకావడం విద్యార్థులకు తప్పనిసరేం కాదని పేర్కొన్నారు. జేఈఈ మాదిరిగానే 10, 12 తరగతుల విద్యార్థులకు కూడా బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరవ్వచ్చని, అది ఐచ్ఛికం అని చెప్పారు.

## భారత్‌లో వాట్సాప్ నిలిపేస్తాం!

- ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ వద్దని చెప్తే తప్పదిక
- ఐటీ రూల్స్ 4(2) నిబంధన వ్యక్తిగత గోప్యతకు వ్యతిరేకం
- ఢిల్లీ హైకోర్టుకు వాట్సాప్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: చాట్‌లు, కాల్స్, వీడియోలు, ఫైల్స్, వంటి వాటిని గోప్యంగా ఉంచే ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని వదులుకోమని ఒత్తిడి చేస్తే భారత్‌లో తమ సేవలు నిలిపివేయాల్సి వస్తుందని వాట్సాప్ స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్ – 2021లోని 4(2) నిబంధనను సవాల్ చేస్తూ వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఏదైనా పోస్ట్ లేదా మెసేజ్ మొదట ఎవరి వద్ద నుంచి వచ్చింది, ఎవరు దాని సృష్టికర్త అనేది సోషల్ మీడియా సంస్థలు గుర్తించాలని(ట్రేసబులిటీ) ఈ నిబంధన చెప్తున్నది. అయితే, ఇలా చేయాలంటే కోట్లాది మెసేజ్‌లను కొన్ని ఏండ్ల తరబడి స్టోర్ చేయాల్సి ఉంటుందని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి నిబంధన లేదని వాట్సాప్ తరపు న్యాయవాది తేజస్ కరియా ఢిల్లీ హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పైగా ఎండ్ టూ ఎండ్ ఎంక్రిప్షన్(ఎక్కడా మెసేజ్ స్టోర్ అవకుండా నేరుగా పంపించిన వారి నుంచి అందుకునే వారికి వెళ్లడం) విధానానికి విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు.

**గోప్యతకు భంగం కలిగించలేం**

ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ వల్ల తమ చాట్‌లు, సమాచారం, ఫైల్స్ వంటివి గోప్యంగా ఉంటాయనే నమ్మకంతోనే భారత్‌లో కోట్లాది మంది వినియోగదారులు వాట్సాప్‌ను వినియోగిస్తున్నారని, దీనికి భంగం కలిగే పరిస్థితే వస్తే తమపై వినియోగదారుల నమ్మకం దెబ్బతింటుందని వివరించారు. 4(2) నిబంధన వల్ల ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని బలవంతంగా తొలగించాల్సి వస్తుందని, ఇలా చేయమని చెప్తే వాట్సాప్ భారత్‌ను వదిలి వెళ్తుందని న్యాయవాది కోర్టుకు తెలిపారు. 4(2) నిబంధన వ్యక్తుల గోప్యతకు కూడా వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. కాగా, 2021 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త ఐటీ నిబంధనలను అమలులోకి తీసుకువచ్చింది. అన్ని సోషల్ మీడియా సంస్థలు ఈ నిబంధనలు పాటించాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నిబంధనల్లో కొన్నింటిని సోషల్ మీడియా సంస్థలు వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఈ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేసింది.

